"ఇంకేం కమల రేపు మొగుణ్ణికూడా బీరువాలో పెట్టి తాళంవేసి మెళ్లో కట్టుకుంటుంది." అవి ఎవరో అన్నారు.

శర్మకు ముళ్ళమీద వున్నట్లుగా వుంది.

"జడబావుందా శర్మా!" అని ఒక ముత్తయిదువ పలకరించింది.

"ఆహా! దాని వీపువేసి కట్టండి" అన్నాడు కోపంగా. కమల తాళం చెవులు మెడలోంచి తీసి కాళ్ళదగ్గర పడేలా విసిరేసింది.

"అంత పొగరుకూడదే పిల్లా—" అంది ఆవిడ.

"ఇంత దెబ్బలాడుకుంటున్నారు. వీళ్ళు మధ్యాహ్నం బంతులేం ఆడతారూ?" అని సంశయం వెళ్ళబెట్టింది బంతులాటకోసం కాచుకు కూచున్న ఒక పేల్చంతి.

శర్మ తాళాలు తీసుకుని నెమ్మదిగా వెళ్ళిపోయాడు.

"ఇహ వీళ్ళను నమ్ముకుంటే లాభంలేదొదినా — వేగం కమలకు జడపూర్తిచేసి లక్షిం నరుసుకు ప్రారంభించు. రామ్మూర్తన్నయ్యా లక్షింనరుసూను బంతులాటకు కూర్చుంటారు!" అని వేళాకోళమాడింది. ఆడతగ్గ మహిళ. కమలకూడా ఫక్కున నవ్వింది.

"మీరూ — మీ మోటు సరసాలూనూ, అతనువింటే బాగుండదు." అంది నవ్వాపుకుంటూ సీతమ్మగారు.

ఇంతలో లక్షింనరుసుకి లోపల్నుండి పిలుపు వచ్చింది.

"వెళ్ళమ్మా! అంతఃపురంలోకి—" అన్నారు కూర్చున్నవాళ్లు.

"నేను వెళ్ళను పెద్ద వొదినచేత పూజడ వేయించుకుంటాను...." అంది చిన్నపిల్లలా పట్టుబడుతూ లక్షింనరుసు.

ఆడాళ్లు తెల్లపోయారు.

సీతమ్మగారు బెంగపెట్టుకుంది. వీళ్ళ దెబ్బలాటలగురించి ఆవిడ కేమీ విచారం లేదు. ముహూర్తం నిశ్చయించాక ఉత్తరాలు రాసి, టిల్లి గ్రాములు కొట్టినా – రామ్మూర్తినుంచి జవాబు లేదు. ఇతను అక్కణ్ణుంచి వూడి పడడు. ఇదివరకు ఒక ముహూర్తం తప్పించాడు. మొదటి ముహూర్తానికే దిగడ్డ చుట్టాలు పెళ్ళి అయేవరకూ కదిలేట్టు లేరు. తోడి కోడళ్ళకు నెలలు నిండాయి. వాళ్ళు నీళ్ళాడేస్తే పురుటిక్కాన – పెళ్ళిమాట ఎత్తేందుకు వీలుండదు. కమలనుచూస్తేసీతమ్మగారికి బెంగ పట్టుకుంది. ముద్దబంతి పూవులా వుంది. ఆ మూడుముళ్లూ వేయిస్తే పిల్లా పిల్లాడు కళ్ళముందు పడి వుంటారు.

రామ్మూర్తి పిల్లాడ్ని తీసుకుపోతే, ఆ పసి వెధవ ఆలనా పాలనా లేక అష్టకష్టాలు పడితే ఆవిడ భరించలేదు. ఆవిడ మంచితనంమీద ఎవ రేనా దెబ్బతీస్తే అది ఆవిడకు ఘోరమైన అవమానం చేసినట్లు బాధపడు తుంది.

'తండ్రిలేని పిల్లల్నీ, తల్లిలేని పిల్లల్నీ ప్రోగుచేస్తావు. ఎందుకు నీకీ లేనిపోని జంఝాటం_' అని ఎవరైనాఅంటే ఆవిడ కష్ట పెట్టుకుం టుంది

పిల్లలు రామ్మూర్తి దగ్గర కెళ్ళరు. తండ్రి కోపిష్టి అని వాళ్ళకు బెదురు. లక్షింనరుసు దగ్గర వాళ్ళకు చనువులేదు. సవతి తల్లిమీద అయిష్టం తండ్రిమీద అయిష్టంగా మారటం సహజమే! కాని వాళ్లు అను కున్నవి తలక్రిందులయాయి.

లక్షింనరుసు సవతి తల్లి కానేకాదు. ఆవిడో బహూన్....పిల్ల లతో కలసి అల్లరి చేస్తుంది! పాటలు పాడుతుంది. లక్షింనరుసుకి మగా ళ్ళంటే భయంలేదు. మగాళ్ళ పేకాడుతూంటే అక్కడకెళ్ళి వాళ్ళ మధ్యలో కూర్చుంటుంది.

రామ్మూర్తి కిటికీలోంచి చీరా రవికా అందించక తప్పలేదు. దొడ్లో మందార చెట్టు వెనక్కు వెళ్ళి ఆ ఇస్త్రీ చీరను చుట్టుకుని బయటకొచ్చింది.

'చీరంతా బురద మరకలు చేసేశావ్ పిన్నీ' అంది కమల.

శేషుగాడు ఎక్కడ్నుంచో ఓ కుక్కపిల్లని పట్టుకొచ్చి దాన్తో ఆడుతున్నాడు. లక్షింనరుసు దాన్నివళ్ళో పెట్టుకు కూర్చుని కాళ్ళకు చెవులకి మొహానికీ పసుపురాసి బొట్టెట్టింది. అది కుయ్యో మొర్రో మన కుండా పేరంటాలులా రాయించుకుంటోంది.

రామ్మూర్తి తోలుపటకా పుచ్చుకుని వీరభద్రుళ్లా పందిట్లోకొచ్చి పెళ్లాంమీద విరుచుకుపడ్డాడు. లక్షింనరుసు అమ్మో నాయనో అంటూ అరుస్తూ శేషుగాడ్ని గట్టిగా కావలించుకుంది. పసుపు రాసుకున్న కుక్క బొంయ్‌మంటూ రామ్మూర్తి మీద తిరగబడి అరుస్తోంది. బెల్టుదెబ్బలు శేషుగాడికికూడా బాగా తగిలాయి. శర్మ పరిగెట్టుకొచ్చి రామ్మూర్తి చేతు ల్లోంచి బెల్టులాక్కోపోయాడు. కమల వచ్చి లక్షింనరుసుని లాగ బోయింది.

కమలకూ శర్మకూకూడా దెబ్బలు తగిలాయి. సీతమ్మగారు వచ్చే సరికి రామ్మూర్తి పిచ్చికుక్కలా పందిట్లో వీరవిహారం చేస్తున్నాడు.

పేకాట్లోవున్న మగాళ్లొచ్చి రామ్మూర్తిని చెరో రెక్కా పుచ్చుకు గదిలోకి ఈడ్చు కెళ్ళేవరకూ అతను ఉగ్రనరసింహావతారంలో వున్నాడు.

సీతమ్మగారు శేషుగాడ్నీ శర్మనూ కమలనూ వాటేసుకుని గోలు గోలున రాగాలెట్టింది.

లక్షింనరుసు బెల్టు దెబ్బలకు స్పృహ తప్పి చాపచుట్టలా పడి పోయింది.

'ఏం పనిచేశావ్ దుర్మార్గుడా—కూతుర్నీ అల్లుడ్నీ పెళ్ళి పందిట్లో కొట్టుకోవడానికి చేతులెలా వచ్చాయో....' అని వాపోయింది.

